VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఫిబ్రవరి 19 బుధవారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 210

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



సైబర్ నేరాల నియంత్రణలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సైబర్ భద్రతలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

# సైబర్ భద్రతలో నంబర్-1 అవుతాం

**రాష్ట్రాన్ని సెక్యూర్ బిజినెస్ హబ్‌గా మార్చాలి**

**డీప్ ఫేక్‌తో వైషమ్యాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలి**

**'షీల్డ్-2025' సైబర్ సెక్యూరిటీ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: సైబర్ నేరాల నియంత్రణలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సైబర్ భద్రతలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ), సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో మంగళవారం 'షీల్డ్-2025' సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'గతేడాది సైబర్ నేరగాళ్లు దేశవ్యాప్తంగా రూ.22,812 కోట్లు దోచుకున్నారని ఒక అంచనా. ఇది మన ఆర్థిక వ్యవస్థతోపాటు పౌరులకూ ముప్పే. ఈ అంశంపై దేశవ్యాప్తంగా అందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరముంది. ఈ నేరాల నియంత్రణలో దేశంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉంది. సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో పాటు హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. కేంద్రీకృత సైబర్ క్రైమ్ పోర్టల్ రూపకల్పనలో తెలంగాణ పోలీసులు కీలకపాత్ర పోషించారు. ఇప్పుడా సాంకేతికతను 27 రాష్ట్రాలు వినియోగిస్తున్నాయి. గతేడాది సుమారు 18 వేల మంది బాధితులు కోల్పోయిన సొమ్ములో రూ.183 కోట్లను తిరిగి ఇప్పించడంలో టీజీసీఎస్‌బీ కీలకంగా వ్యవహరించింది. హెల్ప్‌లైన్ నంబరు 1930 గురించి అందరికీ అవగాహన కల్పించేలా షేర్ చేయాలి. గతేడాది మా ప్రభుత్వం కొత్తగా 7 సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌లను ప్రారంభించింది' అని పేర్కొన్నారు. 'ఒకప్పుడు హత్యలు, అత్యాచారాలను తీవ్ర నేరాలుగా పరిగణించేవారు. సైబర్ నేరాలతో ఇప్పుడు తిజోరీ అర్థం మారిపోయింది. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లే సైబర్ నేరస్థులకు తిజోరీలుగా మారిపోయాయి. వారిని గుర్తించడం..

పట్టుకోవడం.. శిక్షించడం.. ఇలా ప్రతిదీ సవాలుతో కూడుకున్నదే. దానికి తగ్గట్టుగా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ప్రభుత్వం, దర్యాప్తు, ఐటీ సంస్థలు సంయుక్తంగా పనిచేసి బలమైన సైబర్ భద్రత వ్యవస్థను రూపొందించాలి.




2లో

## కులగణన శాస్త్రీయంగా చేపట్టాలి

చట్టబద్ధత, శాస్త్రీయత లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కులగణన చేసి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు.

బీసీల జనాభా ఎందుకు తగ్గిందో సీఎం రేవంత్ చెప్పాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల డిమాండ్



2లో

## రియల్ ఎస్టేట్ తప్ప.. స్టేట్ అభివృద్ధిపై ఆలోచన లేదు

సీఎం రేవంత్‌రెడ్డికి రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ అభివృద్ధిపై ఎలాంటి ఆలోచన లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎన్నికల తర్వాత కల్వకుర్తి ప్రాంతంలో దాదాపు వెయ్యి ఎకరాల భూమిని రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యులు సంపాదించుకున్నారని ఆరోపించారు.

ఆమనగల్లు రైతు దీక్ష సభలో మాట్లాడుతున్న కేటీఆర్. వేదికపై ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్,

శ్రీనివాస్‌గౌడ్, జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు, తాటికొండ రాజయ్య,

అంజయ్యయాదవ్, లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, సబితారెడ్డి తదితరులు





2లో

## యూట్యూబ్ ఛానళ్ల ఇష్టారాజ్యానికి కళ్లెం వేయనున్న సుప్రీం

యూట్యూబ్ వంటి ఆన్‌లైన్ వేదికల నియంత్రణకు చట్టంలో శూన్యత నెలకొందని, దీన్ని యూట్యూబర్లు తమ ప్రయోజనం కోసం వాడుకుంటున్నారని సుప్రీంకోర్టు మంగళవారం అభిప్రాయపడింది.

# కృష్ణా జలాల తరలింపుపై చర్యలు తీసుకోండి

హైదరాబాద్: తెలంగాణకు కృష్ణా జలాల్లో అన్యాయం జరగకుండా చూడాలని, ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తోందని, ఈ వివాదంపై కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అన్ని రాష్ట్రాల నీటిపారుదలశాఖ మంత్రుల సమావేశం-2025లో ఆయనతోపాటు మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఉత్తమ్ మాట్లాడుతూ.. "శ్రీశైలం, సాగర్ కుడి కాలువ నుంచి ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తోంది. ఈ క్రమంలో కృష్ణా జలాల వినియోగాన్ని పర్యవేక్షించడానికి టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలి. నీటి వాటాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన ట్రైబ్యునల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కేలా చూడాలి. రాష్ట్రంలోని డ్యాంలలో పూడికతీత చేపట్టేందుకయ్యే ఖర్చును కేంద్రమే భరించాలి. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి ఎన్డీఎస్‌ఏ విచారణను త్వరగా పూర్తి చేసి నివేదిక అందజేసేలా కేంద్ర జలశక్తి శాఖ జోక్యం చేసుకోవాలి. కేంద్రం చేపట్టిన గంగ, యమున నదుల పునరుజ్జీవ ప్రాజెక్టుతో సమానంగా తెలంగాణలో మూసీ రివర్‌ఫ్రంట్





డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు ప్రాధాన్యమిచ్చి నిధులు కేటాయించాలి. మూసీ పునరుద్ధరణ చర్యలకు రూ.4 వేల కోట్లు, ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లతో మూసీని అనుసంధానించేందుకు రూ.6 వేల కోట్లు సాయం చేయాలి. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సమ్మక్క సాగర్ బ్యారేజీ, సీతారామ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయాలి' అని ఉత్తమ్ కోరారు.

**ఏటా రూ.5 వేల కోట్ల ఖర్చు**

మిషన్ భగీరథకు రూ.16 వేల కోట్లు ఇవ్వాలని గతంలోనే నీతి ఆయోగ్ సిఫార్సు చేసిందని, తెలంగాణలో ఇంటింటికీ సురక్షిత తాగునీటి సరఫరాను స్థిరీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆ నిధులు కేటాయించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క కోరారు. సమావేశంలో తెలంగాణ నీటి అవసరాలపై ఆమె పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. "ఏటా తాగునీటి అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో తాగునీటి కొరతను తీర్చేందుకు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో పని చేయాలి. మిషన్ భగీరథలో సుదూర ప్రాంతాల నుంచి నీటి సరఫరా చేసే క్రమంలో కొన్నిసార్లు సమస్యలు తలెత్తుతున్నాయి. సమీపంలోని నీటి వనరులను గుర్తించి వినియోగించుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందిస్తున్నాం. దీనికి కేంద్రం సాయం అందించాలి" అని సీతక్క కోరారు.

తెలంగాణకు కృష్ణా జలాల్లో అన్యాయం జరగకుండా చూడాలని, ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తోందని, ఈ వివాదంపై కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.

## ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఏ.శరత్. కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్ష.



వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి 18

: రానున్న వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఏ.శరత్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకితభావంతో పని చేయాలని, నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని హితవు పలికారు. మంగళవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి జిల్లాలో మంచి నీటి సరఫరా పరిస్థితిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఏడాది జిల్లాలో ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారని అధికారులను అభినందించారు. ఈ ఏడాది కూడా వేసవి సీజన్ ముగిసేంత వరకు అదే స్ఫూర్తితో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏదైనా నివాస ప్రాంతంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు గమనించిన వెంటనే, ముందస్తుగానే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. బోరుబావుల మరమ్మతులు చేపట్టే మెకానిక్ కు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, బోరు చెడిపోయిందన్న సమాచారం అందిన వెంటనే గంటల వ్యవధిలోపు మరమ్మతులు పూర్తి చేయించి దాహార్తి సమస్య ఏర్పడకుండా సత్వరమే పనులు జరిపించాలన్నారు. తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు చేపడుతున్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఏర్పడితే గ్రామ పంచాయతీలకు చెందిన ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే పక్క జీ.పీకి చెందిన ట్యాంకర్ ను కూడా వినియోగించుకోవాలని సూచించారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించేలా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారం వారం క్రమం తప్పకుండా మండలాల్లో పర్యటిస్తూ పర్యవేక్షణ జరిపేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పట్టణాలతో పాటు ఆయా మండలాలకు తాగునీటిని అందించే జలాశయాల్లో సరిపడా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఈ నేపథ్యంలో అన్ని మండలాల్లో ఎంపిడిఓలు, ఎంపిఓలతో కూడిన క్లస్టర్ బృందాలు నిరంతరం నీటి సరఫరాను పర్యవేక్షించేలా చూస్తామన్నారు. నీటి ఎద్దడి నెలకొనేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలలో ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందిస్తామని జిల్లా ప్రత్యేక అధికారి దృష్టికి తెచ్చారు. జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరా సజావుగానే జరుగుతోందని, వేసవి సీజన్లో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టేవిధంగా అధికారులను, క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తంగా ఉంచుతామని అన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మిషన్ భగీరథ, ఆర్.డబ్ల్యు.ఎస్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను వెంటనే తొలగించాలి.

## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి 18



: ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను గుర్తించి, తక్షణమే వాటిని తొలగించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతి గృహ సముదాయాల నిర్మాణాల కోసం ఆయా ప్రదేశాలలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించేందుకు గాను కలెక్టర్ మంగళవారం నిజామాబాద్ నగర శివారులోని నాగారం, గుండారం ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా గుండారం గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన సందర్భంగా పలు ఆక్రమణలు కలెక్టర్ గమనించారు. వెంటనే వాటిని తొలగించాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పై రెండు ప్రదేశాలలోనూ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, అనుకూల వాతావరణం తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఎంత విస్తీర్ణంలో స్థలం అందుబాటులో ఉంది, రాకపోకలకు అనువుగా రోడ్డు మార్గం అందుబాటులో ఉందా అని పరిశీలన జరిపారు. పరిసర ప్రాంతాలలో నెలకొని ఉన్న పరిస్థితుల గురించి అధ్యయనం చేశారు. సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, తహసీల్దార్ బాలరాజు, సంబంధిత అధికారులు ఉన్నారు.

# రియల్ ఎస్టేట్ తప్ప.. స్టేట్ అభివృద్ధిపై ఆలోచన లేదు

ఆమనగల్లు: సీఎం రేవంత్‌రెడ్డికి రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ అభివృద్ధిపై ఎలాంటి ఆలోచన లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎన్నికల తర్వాత కల్వకుర్తి ప్రాంతంలో దాదాపు వెయ్యి ఎకరాల భూమిని రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యులు సంపాదించుకున్నారని ఆరోపించారు. ఆ భూముల రేట్లు పెంచుకోవడానికి పెద్దరోడ్డును ప్లాన్ చేస్తున్నారని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో మంగళవారం భారాస రైతు నిరసన దీక్ష సభలో ఆయన మాట్లాడారు.

కొడంగల్‌లోనూ ఎవరికీ న్యాయం చేయలేదు

“420 దొంగ హామీలిచ్చి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారు. కొడంగల్‌లో కూడా ఎవరికీ న్యాయం చేయలేదు. పుట్టి పెరిగిన, పిల్లనిచ్చిన కల్వకుర్తి ప్రాంతానికి ఒక్క రూపాయి పనిచేయలేదు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతు రాజులా బతికాడు. నాట్లు వేసే సమయానికి రైతుబంధు డబ్బులు పడేవి. రైతు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా



ఇచ్చిన ఘనత దేశ చరిత్రలో కేసీఆర్‌కే దక్కుతుంది. సభకు హాజరైన జనం

35సార్లు దిల్లీ వెళ్లి 35 పైసలు తేలేదు ఈ ప్రభుత్వం రైతుభరోసా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. 10% రైతులకు కూడా ఇవ్వలేదు. ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి.. ఇప్పటివరకు సక్రమంగా చేసిందేలేదు. పిల్లను ఇచ్చిన అత్తగారి ప్రాంతంలోని ఆడబిడ్డలకు రేవంత్‌రెడ్డి ప్రతి నెలా రూ.2,500 ఇస్తున్నారేమోనని అనుకున్నా. కానీ, ఈ ప్రాంతాన్నీ మోసం చేశారు. 15 నెలల్లో 35సార్లు దిల్లీకి చక్కర్లు కొట్టడంతోనే సరిపోయింది. దిల్లీ నుంచి 35 పైసలు తీసుకురాలేదు! కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రివర్స్ మైగ్రేషన్‌తో వేరే రాష్ట్రాల కూలీలు పాలమూరుకు వచ్చి పనిచేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి తిరగబడింది. 42 శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలను.. రైతు కూలీలకు రూ.12 వేలు, ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, చదువుకునే విద్యార్థులకు స్కూటీలు.. వివాహానికి తులం బంగారం ఇస్తామని మోసం చేశారు. కాంగ్రెస్ పాలనలో 430 మంది రైతులు, గురుకుల పాఠశాలల్లో 56 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. స్థానిక ఎన్నికల్లో ఇంటి ముందుకు వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకుల గల్లాలు పట్టి ఈ అంశాలపై నిలదీయాలి. రేవంత్‌రెడ్డికి బుద్ధిచెప్పే పని కల్వకుర్తి ప్రాంతం నుంచే మొదలు పెట్టాలి” అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రులు సబితారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్, గువ్వల బాలరాజు, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, భారాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఉప్పల వెంకటేశ్‌గుప్తా, భారాస నాగర్‌కర్నూల్ ఇన్‌ఛార్జి నాగం శశిధర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

# యూట్యూబ్ ఛానళ్ల ఇష్టారాజ్యానికి కళ్లెం వేయనున్న సుప్రీం

దిల్లీ: యూట్యూబ్ వంటి ఆన్‌లైన్ వేదికల నియంత్రణకు చట్టంలో శూన్యత నెలకొందని, దీన్ని యూట్యూబర్లు తమ ప్రయోజనం కోసం వాడుకుంటున్నారని సుప్రీంకోర్టు మంగళవారం అభిప్రాయపడింది. “యూట్యూబర్లు ఇష్టారాజ్యంగా నిర్వహించే కార్యక్రమాల్లో అన్నీ చెల్లుబాటవుతున్నాయి. దీనిపై తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆ చర్యలు మేం తీసుకుంటాం” అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం పేర్కొంది. భారతీయ కుటుంబ వ్యవస్థను కించపరచిన ప్రసిద్ధ పాడ్‌కాస్టర్ రణవీర్ అల్హాబాదియా



కేసును ప్రస్తావిస్తూ “మేం అతనికి నోటీసు జారీ చేశాం. దీనిపై చర్య తీసుకోవాలనుకుంటున్నాం. ఇది అత్యంత సున్నితమైన విషయం. దీన్ని నిర్లక్ష్యం చేయబోం” అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఈ కేసు తదుపరి విచారణలో సహాయం అందించాలని కోర్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఆర్.వెంకటరమణిలను కోరారు. కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తే దీనిపై చర్యలు తీసుకోవాలనుకుంటున్నామని న్యాయమూర్తి అన్నారు. యూట్యూబ్ ఛానళ్ల నియంత్రణలో నెలకొన్న శూన్యత ఆందోళన కలిగించే విషయమని ఆయన అన్నారు. అంతకు ముందు కోర్టు పాడ్‌కాస్టర్ రణవీర్ అల్హాబాదియా చేసిన ఆక్షేపణీయ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ “అతని మనసులో మలిన భావనేదో ఉంది. దాన్నే యూట్యూబ్ షో లో బహిర్గతం చేశారు” అని పేర్కొంది

# నివురుగప్పిన అవినీతి నిప్పు !

మంత్రులు కమిషన్లు లేనిదే పనిచేయడం లేదన్న బిజెపి ఆరోపణలు..ఇప్పుడు కాంగ్రెస్ పనితీరుపై అనుమానాలను రేకెత్తిస్తోంది. ప్రతి పనికి 10 నుంచి 15 శాతం కమిషన్ ముట్టచెప్పుకోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని అంటున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపి ఈటెల రాజేందర్ తదితరులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఇది నిజమా అని ఆలోచించే సమయం ఆసన్నమయ్యింది. కెసిఆర్ ప్రభుత్వ అవినీతి గురించి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. అలాగే కాంగ్రెస్ అధిష్టానం కూడా నిధుల కోసం తెలంగాణపై ఆధారపడుతోందన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలను సంతృప్తి పరిచేందుకు ఇక్కడ కమీషన్ల కక్కుర్తి మొదలయ్యిందన్న ఆరోపణలు నిజంగానే బాధ కలిగించేవిగా ఉన్నాయి. ఓ రకంగా విపక్ష బిఆర్ఎస్‌కు ఇది అందివచ్చిన అస్త్రం. ఏమాత్రం సమాచారం దొరికినా పట్టుకుని ఏకిపారేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారు. ఇకపోతే బిల్లులు మంజూరుకు ఓ మంత్రి భార్య నేరుగా కమీషన్లు డిమాండ్ చేస్తోందని కూడా అక్కడా ఇక్కడా గ్రామాల్లో కూడా జనం చర్చించు కుంటున్నారు. బిఆర్ఎస్ అవినీతిపై పోరాడుతున్న కాంగ్రెస్ తానే ఈ బురదలో కూరుకుంటే ఇక చేసేదేమీ లేదు. అలాగే కేంద్రానికి కప్పం కట్టేందుకు అవినీతి కూపంలో దిగితే ప్రజలు గమనిస్తూనే ఉంటారు. బిఆర్ఎస్ ఇలా చేసే మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు బిఆర్ఎస్‌ను అవినీతి పార్టీగా ముద్రవేసి పాలన చేస్తున్న కాంగ్రెస్ కూడా మూల్యం చెల్లించుకోక తప్పదు. తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా ..అని సామెత ఉంది. చేసిన తప్పులన్నీ చేసి..ఇప్పుడు కాంగ్రెస్ మీదపడి ఏడుస్తున్నారని ఇంతకాలం బిఆర్ఎస్ ను విమర్శించి, మనం కూడా అదే ఊబిలో దిగితే కాంగ్రెస్ పార్టీని కూడా ప్రజలు నమ్మరు. ఇంతకాలం బిఆర్ఎస్ పదేళ్ల పాపాల గురించి మాట్లాడారు. ఇప్పుడిక కాంగ్రెస్ అవినీతి గురించి చర్చ మొదలయితే ఆ పార్టీని కాపాడడం కష్టమే. ఎందుకంటే మంత్రులపై సిఎం రేవంత్‌కు పట్టు లేదన్న విమర్శలు వస్తున్నాయి. నిప్పులేనిదే పొగరాదు. బిజెపి చేసిన ఆరోపణలను రేపు బిఆర్ఎస్ చేస్తుంది. అలాగని కాంగ్రెస్ మడిగట్టుకుని కూర్చున్న పార్టీ కాదు. అవినీతిలో ఆరితేరిన చేయి దానిది. ఇంతకాలం తమ పాలనలో అవినీతి వ్యవహారాల గురించి సమాధానం చెప్పడం లేదని ప్రజలు బిఆర్ఎస్‌ను నిందిస్తున్నారు. వారి పాలనలో మల్లన్నసాగర్ రైతులు తిరగబడితే ఎందుకు కేసులు పెట్టారో చెప్పాలని, ఖమ్మం జిల్లాలో రైతులపై ఎందుకు కాల్పులు జరిపారో..ఎందుకు బేడీలు వేశారో చెప్పారని అడుగుతూ వచ్చారు. కాళేశ్వరం అవినీతిపైనా మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలో రైతులను రెచ్చగొట్టిన ఘటనకు సమాధానం చెప్పాలని అన్నారు నిజానికి ఫార్మా కంపెనీల సృష్ట ప్రదాత కెటిఆర్. దానిని ఎవరూ కాదనలేరు. రైతుల భూములను అడ్డంగా లాక్కుని వ్యాపారం చేయడం ఎవరు చేసినా నిలదీయాల్సిందే. కానీ బిఆర్ఎస్ కాదు. అది ప్రజలకు వదిలేయాలి. అవినీతి నేతలు నీతులు వల్లించడం సరికాదు. ఎందుకంటే బిఆర్ఎస్ గురించి చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా అవినీతి కథలు ఉన్నాయి. కానీ ఎదురుదాడి చేయడం, గగ్గోలు పెట్టడం ద్వారా ఎంతోకాలం నమ్మించలేరు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి జరిగిందని అంటున్నారు. నిజంగానే అవినీతి జరిగితే బయటకు లాగాల్సిందే. రేవంత్ అయినా, రాహుల్ అయినా అవినీతి వ్యయహారంఆలపై చర్చ చేయాల్సిందే. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదస్ మున్సీ కూడా వాటాల కోసం డిమాండ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఇప్పటి వరకు ఇవన్నీ ఆరోపణలే కావచ్చు. కానీ నిజం బయటపడితే భగ్గున మండుతుంది. అవినీతిపై చర్చలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి నేతలు ఎవరున్నా వదిలిపెట్టకుండా రచ్చబండ ఏర్పాటు చేస్తే మంచిది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఆ తర్వాత పార్టీలోని కొందరు కీలక నేతలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడం వంటి పరిణామాలతో సహజంగానే బిఆర్ఎస్ పార్టీలో కొంత నీరసం ఆవహించింది. ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెల్చుకోక పోవడం కూడా గులాబీ పార్టీకి రాజకీయంగా భారీ దెబ్బ పడింది. మరోవైపు లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడం కూడా ఆ పార్టీని దెబ్బతీసింది. ప్రతిపక్ష నేతగా చురుకుగా ఉండాల్సిన కెసిఆర్ ఇంటికే పరిమితం కావడం చూస్తున్నాం. అధికారం లేకుంటే అసెంబ్లీలో అడుగు పెట్టమన్న రీతిలో కెసిఆర్, జగన్ తీరు ఉంది. ఈ క్రమంలో తమపై అవినీతి కేసుల దాడి పెరగడంతో ఆత్మరక్షణ కోసం బిఆర్ఎస్ విన్యాసాలు చేస్తోంది. ఎదురుదాడిని ఎంచుకుంది. ఇప్పుడు కాంగ్రెస్‌పై వస్తున్న ఆరోపణల్లో నిజం ఉన్నా లేకున్నా రచ్చ చేసేందుకు బిజెపికి తోడు బిఆర్ఎస్ కూడా ముందుకు రావడం ఖాయం. ఇప్పటికే కాంగ్రెస్ పాలనా వైఫల్యాల ఆధారంగా కెటిఆర్ గత కొద్ది రోజులుగా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావులు ఇద్దరూ అధికార కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. అంశాలవారీగా కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేల చేరిక విషయంలో న్యాయస్థానంలో సవాల్ విసిరారు. బిసి కులగణన,రైతుల రుణ మాఫీ, హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన వంటి అంశాలపై గగ్గోలు చేస్తున్నారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో విదేశీ కంపెనీకి అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రూ.55 కోట్లు నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని, ఈ కేసులో ఏసీబీ విచారణ చేస్తోంది. దీనిపైనా పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. ఇలా తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కిన సమయంలో కాంగ్రెస్ అవినీతి వ్యవహారం అంటూ బిజెపి నేతలు విమర్శలు చేయడం సంచలనానికి దారి తీసింది. బిజెపితో బిఆర్ఎస్‌కు లోపాయకారి ఒప్పందం ఉందని ఆరోపించినంత మాత్రాన ఆరోపణల తీవ్రతను తగ్గించలేం. ఈ క్రమంలో తెలంగాణలో తమపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా మంత్రులు జాగ్రత్తగా ఉండాలి. ప్రజా సమసయలపై శ్రద్ధ పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా మంత్రి కేటీఆర్ ఇప్పటికే అమృత్ టెండర్ల వ్యవహారన్ని తెరపైకి తెచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అమృత్ పథకంలో స్కాంకు తెరలేపారని ఆరోపించారు. అంతే కాకుండా రెవెన్యూ మంత్రి పొంగులేటికి సంబంధించిన స్కాంలను బయటపెడతానని కెటిఆర్ గతంలోనే హెచ్చరించారు. తప్పులేదు. రేవంత్, పొంగులేటిలు తప్పు చేసివుంటే కోర్టుకీడ్చాల్సిందే. అందుకే అందిరి అవినీతిపైనా చర్చ జరగాలి. విచారణ జరగాలి. కేసులు వేయాలి. అందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు మాత్రమే పరిష్కారం చూపగలవు.

# అమెరికా ఫస్ట్ విధానంతో పట్టు బిగించే యత్నం

**వాషింగ్టన్:** రెండోసారి ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాక ప్రపంచం మీద అమెరికా ఆధిపత్యం సాధించాలన్న పట్టుదల కనిపిస్తోంది. అక్రమ వలసదారులను నిర్దాక్షిణ్యంగా ఏరిపారేయడం, సుంకాలు పెంచడం, వివిధ దేశాల్లో జోక్యం చేసుకోవడం వంటివన్నీ ఆయన దూకుడు వ్యవహారాన్ని కనబరుస్తున్నారు. వీసా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని చూస్తున్నాడు. తమగడ్డపై పిల్లను కంటే అమెరికా పౌరసత్వం రాకుండా ఆదేశాలు ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రకాలుగా నిర్ణయాలు తీసుకుంటున్నాడు. మాటల్లో, చేతల్లో తన లక్ష్యం ఆధిపత్యం అన్నది స్పష్టంగా కనిపిస్తున్నది. ఎక్కడా కూడా అయన రాజీ ధోరణి వ్యక్తం చేయడం లేదు. సుంకాల తగ్గింపు కుదరదని మోడీకి మొహం మీదే చెప్పేశాడు. తన దేశ హితమే ముందు అన్న విధంగా అమెరికా ఫస్ట్ సిద్దాంతాన్ని ప్రకటించుకున్నాడు. అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింతగా బలోపేతం చేసేందుకు వాణిజ్యం మీద దృష్టి సారించినట్లుగా కనిపిస్తున్నది. ప్రధానంగా సుంకాల మీద దృష్టి కేంద్రీకరించాడు. ఒకవైపు ఉక్రెయిన్, రష్యా యుద్ధం

ఆపాలని కోరుతూనే, గాజాపై కబ్జాకు ఉపక్రమించే పరిస్థితి చూస్తున్నాం. దశాబ్దాలుగా భారతదేశంలో ఇతర దేశాల జోక్యం అంగీకరించని ఇండియాకు చైనాతో ఉన్న వివాదం పరిష్కరిస్తామని కూడా పేర్కొన్నాడు. గతంలో ఒబామా కాలంలో ఇదే విషయం ప్రస్తావనకు వస్తే, అప్పటి పీఎం మన్మోహన్ సింగ్ సున్నితంగా తిరస్కరించారు. ఏ దేశంతోనైనా నేరుగా చర్చించి తన సమస్యను తాను పరిష్కరించుకునే సత్తా ఇండియాకు ఉందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'గాజా' మీద ఇజ్రాయెల్ యుద్ధాన్ని అక్కడి ప్రధాని నెతన్యాహును ఒప్పించి ఆపించానని చెప్పాడు. షరతుల ప్రకారం హమాస్ వద్ద, అటు ఇజ్రాయెల్ వద్ద ఉన్న ఇరుపక్షాల ఖైదీలను విడతలవారీగా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గాజా మీద యాజమాన్య హక్కు తనకు ఉంటుందని అక్కడ సముద్రపు ఒడ్డున రిసార్టులు, ఇతర ఏర్పాట్లు చేస్తామని, అందుకు గాజాను ఖాళీ చేయాలని ట్రంప్ తెలిపాడు. ట్రంప్ ప్రకటన నెతన్యాహుకు ఆమోదమే. ఎందుకంటే గాజా నుంచి జనాన్ని ఖాళీ చేయించడమే ఆయన లక్ష్యం. ఇక్కడ వీరిద్దరి ఉద్దేశం ఒక్కటే అని తేలిపోయింది. క్రమంలో హమాస్ తమ వద్ద ఉన్న, అఖరి అయుధమైన ఖైదీల విడుదల విషయంలో కొంత ఆలస్యం చేయడమేకాక యుద్ధం, దాడులు మళ్ళీ గాజా ఖాళీ చేయించే విషయంలో నెతన్యాహు, ట్రంప్ కలిసి దాడి చేసే అవకాశం ఉందని అప్రమత్తం అవుతున్నట్టు కనిపిస్తోంది. మరోవైపు తాము గాజా విడిచి ఎటు పోతామని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి 15న హమాస్ నిర్బంధంలో ఉన్న ఇజ్రాయెల్ ఖైదీలను విడుదల చేయాలని ట్రంప్ వార్నింగ్ జారీ చేశాడు. దీంతో మళ్ళీ గాజా మీద దాడి తప్పదా అనే పరిస్థితి నెలకొన్నది.కొన్నిచోట్ల దాడులు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే గాజాలో పాలస్తీనీయులు వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. 92 శాతం గృహాలు, 70 శాతం పెద్ద భవనాలు, ఆసుపత్రులు నేలమట్టం అయ్యాయి. నిరాశ్రయులు ఉండడానికి షెల్టర్ లేదు. గాజా పునర్‌నిర్మాణానికి పదిహేను ఏండ్లకు పైగా పడుతుంది. అయితే, యుద్ధం, బాంబుల వల్ల భూమి పనికి రాకుండా అయ్యిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో గాజాను కబ్జా చేసే పనిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నాడు. అయితే, తాజాగా ట్రంప్ మాటలను చైనా ఖండిస్తూ ముమ్మాటికీ గాజా పాలస్తీనా ప్రజలదే అని పేర్కొంది. ట్రంప్ ఆలోచన ప్రపంచ దేశాలలోని మెజారిటీ ప్రజలు విమర్శిస్తున్నారు. మొత్తానికి ట్రంప్ వ్యవహారం ప్రపంచంపైన ఆధిపత్యం సాధించే దిశగా కొనసాగుతోంది.

వేగుచుక్క

# ఆరుగురి హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష.

బాధితులు ఒకే కుటుంబానికి చెందిన వారు. నిందితులు కొడుకు, తల్లి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 18:**

ఒకే కుటుంబానికి చెందినఆరుగురిని హత్య చేసిన వారికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా కోర్టు న్యాయమూర్తి సునీత కుంచాల మంగళవారం తీర్పు వెలువరించారు. ఏడాదిన్నర క్రితం నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రంలో తన్న స్నేహితుడు ప్రసాద్ తోపాటు వారి కుటుంబానికి చెందిన ఐదుగరిని ప్రశాంత్ అనే యువకుడు వేర్వేరు ప్రాంతాల్లో హత్య చేశాడు. ప్రశాంత్ కు ప్రసాద్ తో బంధుత్వంతోపాటు స్నేహం కూడా ఉండడంతో వారితో సన్నిహితంగా ఉంటూ ఆస్తిని కాజేసేందుకు కుట్ర చేశాడు. ఈ క్రమంలో ఒక్కొక్కరిని హత్య చేస్తూ వచ్చాడు. ఈ ఘటన అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. ఈ కేసులో నిందితుడు ప్రశాంత్ సదాశివనగర్ మండలం భూంపల్లి లో ఒక హత్య వెలుగు చూడగా పోలీసులు దర్యాప్తు చేపట్టి మాక్లూర్ మండలవాసిగా గుర్తించారు. ఆ తరువాత వేర్వేరు ప్రాంతాల్లో ప్రసాద్ కుటుంబ సభ్యుల మృతదేహాలు లభించాయి. చివరగా సోన్ బ్రిడ్జి కింద ఓ శవాన్ని గుర్తించిన పోలీసులు ప్రశాంత్ హత్యలకు పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చారు. ఆరుగురి హత్య కేసులో ప్రశాంత్ తోపాటు అతడికి సహకరించిన తల్లికి సైతం న్యాయమూర్తి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

# బిజేపి అభ్యర్థులను గెలిపించండి.



- అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 18:**

ఎమ్మెల్సీ ఎన్నికల్లోబీజేపీ అభ్యర్థులు కొమురయ్య, అంజిరెడ్డినీ గెలిపించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. మంగళవారం నగరంలో అర్బన్ నియోజకవర్గం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాషాయానికి అడ్డా ఇందూరని, ఉద్యోగులు, మేధావులు బీజేపీ వైపు ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ ఎస్ ప్రభాకర్, ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలి.

- సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 17:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరు గ్యారెంటీ లను పూర్తిస్థా యిలో అమ లు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నగరంలోనీ నార్త్ మరియు సౌత్ ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రలు అందించారు.ఈ సందర్భంగా నీలం సాయిబాబా మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటిన పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని, బస్సుల సంఖ్య ను తగ్గించి ఫ్రీ బస్సును అమలు చేస్తున్నారని ఆరోపించారు. 200 యూనిట్ల విద్యుత్తు మరియు రైతు భరోసా ను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. ఏదో ఒక కుంటి సాకులు చెప్పి రేషన్ కార్డులు ఇవ్వడం లేదని, మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు 2500 నెలకు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు అర్హులైన వారందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, విద్య, వైద్య సౌకర్యం పేదలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర నాయకులు వనమాల సత్యం, గొంట్యల రమేష్ , జన్నారపు రాజేశ్వర్, భాస్కర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిభందనలను తప్పక పాటించాలి.









**డాక్టర్ శ్రీశైలం పిలుపు. పిల్లల వైద్యుల సంఘం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు. రోడ్డు భద్రత క్యూఆర్ కోడ్ పోస్టల్ ఆవిష్కరణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 18:**

రోడ్డు నిభందనలను తప్పక పాటించాలనీ డాక్టర్ శ్రీశైలం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని న్యాల్కల్ రోడ్డు లో గల నలంద పాఠశాలలో పిల్లల వైద్యుల సంఘం మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోడ్డు భద్రత సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టల్ ఆవిష్కరించి, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీశైలం మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని అన్నారు. సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం వంటి చర్యలు నిత్యం ప్రమాదాలకు దారితీస్తున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటు ఇతరులకు కూడా చెప్పాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఏర్పాటుచేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు సలహాలు పాటిస్తూ సేఫ్టీ గా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. వాహనదారులలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతుందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని సేఫ్టీ సెక్యూరిటీగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. రాంగ్ రూట్లో ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపవద్దని తెలిపారు. ఎలక్ట్రిసిటీ ఏడిఈ తోట రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యుత్ ప్రమాదాల నుండి ఎలా రక్షించుకోవాలో వివరించారు. ఇంటి వరండాలో, కాంపౌండ్ వాల్ లకు ఎలక్ట్రిక్ హౌస్ వైరింగ్ దండాలుగా వాడొద్దన్నారు. గాలిపటాలు విద్యుత్ తీగల కు చుట్టుకున్నచో వాటిని తీసే ప్రయత్నం చేయొద్దనీ, ఇది ప్రమాదకరం అని అన్నారు. కరెంట్ షాక్ ఇచ్చిన వారిని మనం ఆత్రుతతో వెళ్లి ముట్టుకోవద్దనీ, మన కూడా షాక్ తలుగుతుందనీ అన్నారు. ఎలాంటి విద్యుత్తు అవసరం ఉన్న టోల్ ఫ్రీ నంబర్ 1912 ఫోన్ చేయలని, సత్వర పరిష్కారం లభిస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, నలంద పాఠశాల చైర్మన్, రెడ్ క్రాస్ నిజామబాద్ డివిజన్ వైస్ చైర్మన్ మురళి కృష్ణ , డైరెక్టర్ ఇంగు నేహా, ప్రిన్సిపల్ శ్రీమతి తనుజ, ఐఏపి కార్యదర్శి శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు..

# రైతుల గోడు పట్టింపు లేని సిఎం.







**సాగుకు నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి రైతుల ఉసురు తగులుతుంది. తక్షణమే మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగంలో తేవాలి. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజం.**

**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్ / సూర్యాపేట**

: ప్రభుత్వం సాగునీళ్లు ఇవ్వక రాష్ట్రంలో పంటలు ఎండుతున్నాయని, అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల గోడు పట్టడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలు ఎండి రైతులు ఆందోళన చెందుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇంకా మాటలు చెబుతూ మభ్యపెడుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి రైతుల ఉసురు తలుగుతుందని శపించారు. తెలంగాణకు నీళ్లు మలపాలన్న సోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేదని, రాజకీయ కక్షతో మేడిగడ్డను వాడుకోక తెలంగాణను ఎండబెడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం నాడు పెద్దగట్టు లింగమంతుల స్వామివారి జాతరలో ఎమ్మల్సీ కవిత పాల్గొని చౌడమ్మ తల్లికి బోనం సమర్పించారు. లింగమంతుల స్వామి వారిని దర్శించుకున్న అనంతరం సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 199 టీఎంసీలతో బనకచర్లలో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని, అనుమతుల కోసం ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ మన ముఖ్యమంత్రి మాత్రం కనీసం నాగార్జున సాగర్ ను కూడా మన ఆధీనంలోకి తీసుకురాలేకపోయారని విమర్శించారు. కాళేశ్వరం ద్వారా సూర్యాపేట జిల్లాలో కేసీఆర్ గోదావరి జలాలను పారించారని, కృష్ణా పరివాహక ప్రాంతంలోనూ గోదావరి నుంచి నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్ దని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో కోదాడ నియోజకవర్గానికి కాళేశ్వరం ద్వారా లక్షా 22 వేల ఎకరాలకు నీళ్లు అందించారని వివరించారు. ఇప్పుడు నీళ్లు ఎందుకు తేవడం లేదని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. ఇప్పుడు నీళ్లు ఎందుకు తేవడం లేదో చెప్పాలని మంత్రి ఉత్తమ్ కు సవాలు విసిరారు. రాజకీయ కక్షతోనే మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగించడం లేదని ఇంజనీర్లు చెబుతున్నారని చెప్పారు. మరో 40 రోజుల పాటు నీళ్లు ఇస్తేనే పంటలు చేతికొచ్చే అవకాశం ఉంటుందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నీళ్లు ఇవ్వడం లేదని లేదన్నారు.

**చౌడమ్మ తల్లికి బోనం సమర్పించిన ఎమ్మెల్సీ కవిత**

సూర్యాపేట : పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా చౌడమ్మ తల్లికి కవిత బోనం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. బోనం ఎత్తుకుని ఆలయం వద్దకు చేరుకున్న కవితకు పూజారులు ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు లింగమంతుల జాతర శుభాకాంక్షలు తెలిపారు. చౌడమ్మ తల్లికి బోనం చెల్లిండం నా అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. సమ్మక్క సారక్క జాతర తరువాత రెండో అతి పెద్దదైన లింగమంతుల

జాతర తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనంగా నిలుస్తుంది

అని తెలిపారు. కేసీఆర్ హయాంలో జాతరకు రూ. 14 కోట్ల నిధులు కేటాయించి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. ఈ ప్రభుత్వం కూడా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నాం అని కవిత పేర్కొన్నారు.

# పసుపు వ్యాపారుల సిండి కేట్ "దోపిడీ"నీ అరికట్టాలి.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 18:**

పసుపు వ్యాపారుల సిండికేట్ దోపిడీపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు ఐక్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ను ఆయన సందర్శించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, పసుపు మార్కెట్ నిర్వహిస్తున్న డైరెక్ట్ పర్చేస్ సెంటర్ ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇతర మార్కెట్లలో పసుపు క్వింటాలుకు రూ. 15వేలు ఉండగా, జిల్లాలో రూ. 10 వేలలోపు చెల్లిస్తూ రైతులను దగా చేస్తున్నా రని ఆరోపించారు. రైతులకు న్యాయం చేయకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గంగారాం, లింగారెడ్డి, నర్సయ్య, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అర్బన్ ఎమ్మెల్యేను జిల్లా ఒలింపిక్ సభ్యుల సన్మానం.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 18:**

అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సంఘ సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకముగా కలిసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి క్రీడాలా అవసరాలు, క్రీడాలకు కావాల్సిన వసతులపై ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే పాత కలెక్టర్ మైదానంను, కూలగొట్టిన కలెక్టర్ భవన సముదయాన్ని చదును చేసి ఇండోర్ స్టేడియంను నిర్మించాలని, అలాగే 400 ట్రాక్ లైన్ వేయడానికి కృషి చేయాలని కోరారు. అలాగే గంగస్థాన్ లో ఒలింపిక్ సంఘ భవనానికి కేటాయించిన 600 గజాల స్థలాన్ని భూకబ్జా దారులనుండి కాపాడాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, తప్పకుండ క్రీడాలా అభివృద్ధి కీ తనవంతు కృషి చేస్తానని, అసెంబ్లీ లో కూడా స్టేడియం గురించి మాట్లాడానని

అన్నారు. భూకబ్జా దారులు ఎంతటి వరైనా వదిలేది లేదని అన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ సంఘ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి మంత్రి కలిసి క్రీడాలను అభివృద్ధి కోసం జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాలని స్టేడియం నిర్మించాలని కోరుదామని అయన అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, చైర్మన్ అంద్యాల లింగయ్య, ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు భక్తవత్సలం, గాధరి సంజీవరెడ్డి, సంయుక్త కార్యదర్శి అబ్దుల్ ఒమార్, సంఘ సభ్యులు జావేద్, సురేష్ పాల్గొన్నారు.



# రూ" 10 కోట్లకు ఎమ్మెల్సీ టిక్కెట్ కొన్న వంగ మహేందర్ రెడ్డి .

- టీచర్ ఎమ్మెల్సి అభ్యర్థి రఘోత్తంరెడ్డి ఆరోపణ.

**వేగుచుక్క న్యూస్, జగిత్యాల**

ఎమ్మెల్సి టికెట్ రూ" 10 కోట్లకు కొనుక్కొని వంగ మహేందర్ రెడ్డి ఎన్నికల బరిలో నిలిచారని టీచర్ ఎమ్మెల్సి అభ్యర్థి రాఘోత్తంరెడ్డి అరోపించారు. మంగళవారం జగిత్యాలలో ఎర్పాటు చేసిన సమావేశంలో రాఘోత్తంరెడ్డి మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారిన వంగ మహేందర్ రెడ్డి, డబ్బుల సంపాదన ధ్యేయంగా ఎన్నికలలో పోటికి దిగుతున్నాడని పేర్కొన్నారు. ప్రైవేటు స్కూల్ లు, కాలేజీలు, రియల్ ఎస్టేట్ దందాలు సాగించే మహేందర్ రెడ్డికి సర్కార్ బడులపై చిత్తశుద్ధి ఎక్కడిదని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు సేవ చేసే వ్యక్తికే టీచర్లు ఓటు వేయాలని కొరారు. అక్రమార్జన కొసమే పలువురు అభ్యర్దులు ఎన్నికలలో పోటికి దిగారని, వారికి ఉపాధ్యాయులు తమ ఓటుతో బుద్ధిచెప్పాలని అన్నారు.టీచర్స్ ఎమ్మెల్సి ఎన్నికలు రాజకీయ ఎన్నికలు గా మారాయని, కార్పోరేట్ శక్తులు పదవిపై అశతో టీచర్స్ ఎన్నికలలో పోటికి దిగుతున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారించే వారినే ఎమ్మెల్సి గా గెలిపించాలని రాఘోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎస్టియూ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి సదానందం గౌడ్, ఉపాధ్యక్షుడు శనిగరపు రవి, జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్, ప్రదాన కార్యదర్శి బైరం హరికిరణ్, పిఅర్ టియూ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, ప్రదాన కార్యదర్శి శ్రీదర్ పలువురు పాల్గొన్నారు.

వేగుచుక్క

# అస్సాంలో అల్లు అర్జున్ ఫ్యామిలీ.. వెకేషన్‌లో సందడి



అల్లు అర్జున్ ప్రస్తుతం తన ఫ్యామిలీతో కలిసి చిల్ అవుతున్నాడు. ఫ్యామిలీ మొత్తాన్ని తీసుకుని అస్సోంలోని అటవీ అందాల్ని చూస్తున్నాడు. అక్కడి జాతీయ పార్కులో సంచరిస్తున్నాడు. మామూలుగా అయితే బన్నీ ఇంటర్నేషనల్‌గా వెకేషన్స్ వేస్తుంటాడు. ఫారిన్ కంట్రీస్‌కే వెళ్తుంటాడు. కానీ ఇప్పుడు ఉన్న కేసుల దృష్ట్యా దేశం దాటి బయటకు వెళ్లలేని పరిస్థితి. అందుకే ఇలా అస్సోంలో తిరిగేస్తున్నాడు.

అల్లు అర్జున్ ప్రస్తుతం పుష్ప 2 మేనియా నుంచి బయటకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాడు. పుష్ప రాజ్ గెటప్‌ను తీసేశాడు. లుక్ మార్చేశాడు. బన్నీ చాలా రోజుల తరువాత కొత్తగా కనిపించాడు. ఇన్నేళ్లు ఫుల్లుగా గడ్డంతో కనిపించేవాడు. ఇప్పుడు చాలా యంగ్‌గా అనిపిస్తున్నాడు. ఇక బన్నీ పుష్ప 2 అంటూ రెండు, మూడేళ్లు ఫ్యామిలీకి అంతగా టైం ఇవ్వలేకపోయాడు. ఇక ఇప్పుడు కొత్త సినిమా ప్రారంభానికి కాస్త గ్యాప్ దొరికింది. ఈ టైంని ఫుల్లుగా ఫ్యామిలీకే కేటాయించాడు బన్నీ. ప్రస్తుతం బన్నీ ఫ్యామిలీ ఎంజాయ్ చేస్తోంది. అల్లు అర్జున్ మామూలుగా అయితే వెకేషన్ విదేశాలకు వెళ్తుంటాడు. కానీ బన్నీ మీద ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. బెయిల్ మీద బయటకు వచ్చాడు. ఇప్పుడు విదేశాలకు వెళ్లాలంటే పర్మిషన్ రావడం కష్టం. అందుకే ఇలా ఇండియాలోని ప్రకృతిని ఆస్వాధిస్తున్నాడనిపిస్తోంది. అస్సాంలోని నేషనల్ పార్కులో బన్నీ ఫ్యామిలీ సందడి చేస్తోంది. నమేరి నేషనల్ పార్కులో ఉన్నట్టుగా అల్లు స్నేహా రెడ్డి లొకేషన్ పెట్టింది.

ప్రస్తుతం అర్హ, అయాన్, బన్నీ, స్నేహా రెడ్డి ఈ అస్సాం వెకేషన్‌ను బాగానే ఎంజాయ్ చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఇక త్రివిక్రమ్ ప్రాజెక్ట్ మీద ఇంత వరకు క్లారిటీ అయితే రాదు. త్రివిక్రమ్ ఇంకా కథను వండే పనిలోనే ఉన్నాడని సమాచారం. ఇంకా టైం తీసుకునేలా ఉన్నాడని బన్నీ మరో ప్రాజెక్ట్ మీదకు వెళ్తున్నాడని అంటున్నారు. అట్లీతో కథా చర్చలు కూడా పూర్తయ్యాయ్ అని, అట్లీతోనూ మూవీ వెంటనే ఉంటుందని అంటున్నారు. మరి త్రివిక్రమ్ బన్నీ ప్రాజెక్ట్ ఉంటుందా? కాస్త వాయిదా వేస్తారా? లేదంటే సమ్మర్‌లోపే స్టార్ట్ చేస్తారా? అన్నది చూడాలి. ఈ మూవీని సితారా బ్యానర్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అప్పట్లో నాగవంశీ కొంచెం లీక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇంత వరకు ఇండియాలో టచ్ చేయని జానర్, పాయింట్‌తో త్రివిక్రమ్ వస్తున్నాడని హైప్ పెంచేశాడు. కానీ ఇంత వరకు కథ మాత్రం ముందుకు జరగడం లేదని టాక్.



# సాయిపల్లవికి ముద్దు పెట్టిన అభిమాని

తన అభినయంతో పాటుగా డ్యాన్సులతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. తనకంటూ సపరేట్ గా ఫాలోయింగ్ ఏర్పరచుకుంది. 'అమరన్' 'తండేల్' వంటి బ్యాక్ టూ బ్యాక్ బ్లాక్ బస్టర్స్ తో ఫుల్ ఖుషీ అవుతున్న పల్లవి.. ఇప్పుడు బాలీవుడ్ లో ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయింది. తాజాగా ఆమె చేతిని ఓ లేడీ ఫ్యాన్ కిస్ చేస్తున్న వీడియో ఇంటర్నెట్ లో వైరల్ అవుతోంది.

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. స్టార్ హీరోలతో ఈక్వల్ గా ఆమెకు ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. సుకుమార్ లాంటి అగ్ర దర్శకుడే స్వయంగా 'లేడీ పవర్ స్టార్' అనే ట్యాగ్ ఇచ్చారంటేనే, జనాల్లో ఆమెకున్న క్రేజ్ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. చేసింది తక్కువ సినిమాలే అయినా.. వాటితోనే ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసుకుంది. కేవలం పల్లవి కోసమే సినిమాకి వెళ్లే ఆడియన్స్ చాలామందే ఉన్నారు. అయితే ఇప్పుడు ఓ అభిమాని ఆమెకు 'బాషా' రేంజ్ లో ఎలివేషన్ ఇస్తూ క్రియేట్ చేసిన ఓ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది.

చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అక్కినేని నాగ చైతన్యకు జోడీగా కనిపించింది. బుజ్జి తల్లి అనే పాత్రలో అద్భుతమైన నటన కనబరిచింది. ఫిబ్రవరి 7వ తేదీన విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించింది. ఇక ఈ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా నిర్వహించిన ఈవెంట్స్ లో సాయి పల్లవి సందడి చేసింది. రిలీజ్ కు ముందు తండేల్ జాతర ఈవెంట్ లో సాయి పల్లవి చెయ్యిని ఓ మహిళా అభిమాని ముద్దు పెట్టుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఓ అమ్మాయి 'తండేల్' ఈవెంట్ లో సాయి పల్లవికి షేక్ హ్యాండ్ ఇచ్చి, వెంటనే కిస్ చేసింది. 'బాషా' సినిమాలో ఆటో డ్రైవర్ మాణిక్యం ఇంటర్వెల్ లో మాణిక్ బాషాగా మారిన సమయంలో, తన అనుచరులు అంతా వచ్చి సూపర్ స్టార్ రజనీకాంత్ చేతిని ముద్దు పెట్టుకుంటారు. ఆ సీన్ తో ఇప్పుడు సాయి పల్లవి క్లిప్ ని కంపేర్ చేస్తూ, ఓ నెటిజన్ వీడియో పోస్ట్ చేసాడు. సినిమాల విషయానికొస్తే, సెలెక్టివ్ గా స్క్రిప్ట్స్ ఎంచుకుంటూ వస్తోన్న సాయి పల్లవి.. గత మూడేళ్ళలో నాలుగు చిత్రాల్లో నటించింది. 'గార్గి' వంటి విమెన్ సెంట్రిక్ మూవీతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. గతేడాది 'అమరన్' చిత్రంతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకుంది. దీంతో 300 కోట్ల క్లబ్ హీరోయిన్ల లిస్టులో చేరిపోయింది.



# మరీ అంత ఇష్టమా?..

రామ్ చరణ్‌కి ఓ చెక్ షర్ట్ ఉంది. గత పదేళ్లుగా ఆ షర్ట్‌ను వాడిందే వాడుతున్నాడు. చాలా సందర్భాల్లో అదే షర్ట్ మీద రామ్ చరణ్ ఉన్న ఫోటోలు బయటకు వచ్చాయి. రీసెంట్ బుచ్చిబాబు సానాతో కూడా అదే షర్టులో కనిపించాడు.అసలు ఏంటన్నా.. ఆ షర్ట్ అంటే నీకు ఎందుకంత ప్రేమ అంటూ మెగా ఫ్యాన్స్ ఫన్నీగా కామెంట్లు చేస్తున్నారు. నచ్చితే బాయ్స్ ఇలానే రిపీట్ చేస్తుంటారని మీమ్స్ వేస్తున్నారు.

రామ్ చరణ్ ప్రస్తుతం నెట్టింట్లో బాగా ట్రెండ్ అవుతున్నాడు. ఈ క్రమంలో బుచ్చిబాబుకి రామ్ చరణ్ బర్త్ డే విషెస్ చెబుతూ ఓ ఫోటోను వదిలాడు. ఆ ఫోటోలని షర్ట్‌ని చూసిన వారంతా ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. ఏంటన్నా.. నువ్వు కూడా మా మిడిల్ క్లాస్ అబ్బాయిల్లా ప్రవర్తిస్తున్నావ్.. ఎందుకు ఎప్పుడూ ఇదే షర్ట్ వేసుకుంటున్నావ్.. నీకు ఈ షర్ట్ అంటే అంత ఇష్టమా? అంటూ కామెంట్లు పెడుతున్నారు.

రామ్ చరణ్ చెక్ షర్ట్స్ మీద ఫన్నీగా మీమ్స్ క్రియేట్ చేస్తుంటారన్న సంగతి తెలిసిందే. 2016 నుంచి ఇదే షర్ట్‌ని మార్చి మార్చి వేసుకుంటున్నాడు. ఆర్ఆర్ఆర్ ప్రమోషన్స్‌లోనూ ఇదే షర్ట్‌ని వేసుకున్నాడు. ఎన్నికల టైంలో పవన్ కళ్యాణ్ వద్దకు వెళ్లినప్పుడు పిఠాపురంలోనూ ఇదే షర్ట్‌తో కనిపించాడు. ఇక ఇప్పుడు కూడా ఇదే షర్ట్‌తో కనిపించాడు. దీంతో ఫ్యాన్స్ ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. బాయ్స్‌కి ఓ షర్ట్ నచ్చితే.. చినిగే వరకు వేసుకుంటూనే ఉంటారు అంటూ ఫన్నీగా రియాక్ట్ అవుతున్నారు. ఇదేదో చాలా కలిసి వచ్చిన షర్టులా ఉంది.. సెంటిమెంట్ అనుకుంటా.. అందుకే ఇన్ని సార్లు వాడేస్తున్నాడని కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్ చిన్న వెకేషన్‌లో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఫిబ్రవరి మొదటి రెండు వారాలు అయితే షూటింగ్ అంటూ ఫుల్ బిజీగా ఉన్నాడు. జ్వరం వచ్చినా కూడా రామ్ చరణ్ షూటింగ్‌కు అంతరాయం కలిగించలేదని సమాచారం.



# ఓవైపు గీతా, మరోవైపు సితార..

కోలీవుడ్ బ్రదర్స్ సూర్య, కార్తీలకు టాలీవుడ్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. 'గజిని', 'యముడు' సిరీస్, 'సూర్య సన్నాఫ్ కృష్ణన్' 'ఆకాశం నీ హద్దురా' వంటి చిత్రాలతో సూర్య తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తెలుగులో స్ట్రెయిట్ సినిమా చేయాలనే తన మనసులోని కోరికను బయట పెట్టాడు. మంచి కథ దొరికితే తెలుగులో ఎంట్రీ ఇస్తానని చాలా సార్లు చెప్పాడు. 'కంగువ' ప్రమోషన్స్ లోనూ ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే ఇన్నాళ్లకు సూర్య తెలుగులో రెండు ప్రాజెక్ట్స్ కమిట్ అయినట్లుగా టాక్ వినిపిస్తోంది.

తెలుగులో మంచి క్రేజ్ ఉన్న తమిళ హీరోలలో సూర్య ఒకడు. డబ్బింగ్ చిత్రాలతో తనకంటూ సపరేట్ మార్కెట్ క్రియేట్ చేసుకున్నారు. ఆయన్ను 'టాలీవుడ్ దత్తపుత్రుడు' అని పిలుచుకుంటుంటారు. అందుకే స్ట్రెయిట్ తెలుగు మూవీ చేయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నాడు. భారీ రెమ్యునరేషన్ ఇచ్చి వందల కోట్ల బడ్జెట్ ఖర్చు చేయడానికి మన నిర్మాతలు కూడా రెడీగా ఉన్నారు. చాలా ఏళ్లుగా స్క్రిప్టులు వింటున్నారు కానీ, సరైన కథ కుదరడం లేదు. అయితే ఇన్నాళ్లకు ఓ రెండు స్టోరీలు సెట్ అయినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి.

సూర్యతో సినిమా చేయడానికి స్టార్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నారు. గీతా ఆర్ట్స్ లో బోయపాటి శ్రీనుకి ఇచ్చిన అడ్వాన్స్ అలానే ఉండటంతో, సూర్యతో ప్రాజెక్ట్ సెట్ చేయాలని ట్రై చేసారు. బోయపాటి చెన్నై వెళ్లి స్టోరీ లైన్ కూడా వినిపించారు. దర్శక హీరోలిద్దరూ పలు సందర్భాల్లో ఒకే వేదిక మీద కనిపించడంతో.. సినిమా ఫిక్స్ అయినట్లేనని అంతా భావించారు. కానీ ఎందుకనో ఈ కాంబినేషన్ కుదరలేదు. అయితే ఇప్పుడు చందూ మొండేటి – సూర్య కాంబో కోసం అల్లు అరవింద్ చాలా గట్టిగా ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది.

'కార్తికేయ 2' వంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత, గీతా ఆర్ట్స్ బ్యానర్ లో సినిమా చేయడానికి డైరెక్టర్ చందూ కమిట్ అయ్యారు. రామ్ చరణ్, సూర్య వంటి స్టార్ హీరోలకు కథలు రెడీ చేసారు. ఆల్రెడీ చెర్రీకి ఓ స్టోరీ కూడా వినిపించారు. ఆ తర్వాత సూర్యకు కూడా రెండు ఐడియాలు చెప్పారు. వాటిల్లో ఒకటి హీరోకి నచ్చింది. కానీ చివరకు 'తండేల్' స్క్రిప్టు దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. అక్కినేని నాగ చైతన్యతో తీసిన ఈ చిత్రం.. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయం సాధించింది. దీంతో చందు మొండేటి నెక్ట్స్ సినిమా ఏంటనే చర్చ మొదలైంది.

ఇండస్ట్రీలో వినిపిస్తున్న టాక్ ప్రకారం, చందూ రీసెంట్ గా హీరో సూర్యను కలిశాడు. అతడితో కథా చర్చలు ప్రారంభించాడు. అన్నీ అనుకున్నట్లు జరిగితే అల్లు అరవింద్ సమర్పణలో ఈ కాంబో సెట్స్ మీదకు వెళ్తుంది. అయితే చందూ మొండేటి లైనప్ లో 'కార్తికేయ 3' మూవీ కూడా ఉంది. 'కార్తికేయ 2' అప్పుడే దీనికి కొనసాగింపుగా మూవీ ఉంటుందని ప్రకటించారు. కానీ దర్శకుడు ముందుగా సూర్య సినిమాపైనే వర్క్ చేయాలని ఫిక్స్ అయ్యాడట. ఆ తర్వాతే హీరో నిఖిల్ సిద్దార్థ ప్రాజెక్ట్ పట్టాలెక్కుతుందని వార్తలు వస్తున్నాయి.

ఇదంటుంచితే, సూర్యతో సినిమా చేయడానికి సితార ఎంటర్టైన్మెంట్స్ నాగవంశీ కూడా ట్రై చేస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ప్రాజెక్ట్ సెట్ చేయాలని చూస్తున్నారు. 'తొలి ప్రేమ', 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న వెంకీ.. సూర్యకు లైన్ నచ్చిందని, మారుతి కారు ఇండియాకి ఎలా వచ్చిందనే డిఫెరెంట్ కాన్సెప్ట్‌తో ఉంటుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# శివమణిని మించిపోయేలా ఉన్నాడే!



నటసింహం నందమూరి బాలకృష్ణ తన కెరీర్ లో ఎన్నడూ లేనంత ఫుల్ ఫామ్ లో ఉన్నాడు. 'అఖండ' సినిమాతో సక్సెస్ ట్రాక్ ఎక్కిన ఈ సూపర్ సీనియర్ హీరో.. అక్కడి నుంచి వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. ఓవైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు బసవతారం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకోవైపు ఎమ్మెల్యేగా హిందూపూర్ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. తాజాగా తలసేమియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఈవెంట్ కోసం తనవంతు సపోర్ట్ చేసారు. పాట పాడటమే కాదు, డ్రమ్స్ కూడా వాయించి ఫ్యాన్స్ ను ఉత్సాహ పరిచారు.

బాలయ్యకు తొడలు కొట్టడమే కాదు.. డ్రమ్స్ వాయించడం కూడా వచ్చని అంటున్నారు నందమూరి ఫ్యాన్స్. తలసేమియా బాధితులకు సహాయం అందించేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టాలీవుడ్ సెన్సేషన్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.థమన్ కన్సర్ట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. 'యుఫోరియా' పేరుతో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం సాయంత్రం ఈ మ్యూజికల్ నైట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నందమూరి బాలకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలయ్య డ్రమ్స్ వాయించి ఆడియన్స్ ను అలరించారు.

యూఫోరియా మ్యూజికల్ ఈవెంట్ లో ప్రముఖ డ్రమ్మర్ శివమణి డ్రమ్స్ వాయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ సమయంలో స్టేజ్ మీదకు వెళ్లిన బాలకృష్ణ.. శివమణితో కలిసి ఇన్స్ట్రుమెంట్స్ వాయించాడు. ప్రొఫెషనల్ వాయిద్యకారుడిలా బాలయ్య డ్రమ్స్ ప్లే చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది చూసి నందమూరి అభిమానులు మురిసిపోతున్నారు. బాలయ్యకు సినిమాల్లో యాక్టింగ్ చేయడమే కాదు, మ్యూజిక్ కొట్టడం కూడా వచ్చని కామెంట్స్ చేస్తున్నారు. శివమణిని మించిపోయేలా డ్రమ్స్ వాయించాడని పోస్టులు పెడుతున్నారు. యాంటీ ఫ్యాన్స్ మాత్రం ఎప్పటిలాగే దీనిపై సెటైర్లు వేస్తున్నారు.

పద్మభూషణ్ అవార్డు వచ్చిన తరువాత మొదటిసారిగా బాలకృష్ణ విజయవాడకు రావడంతో, అభిమానులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఇక ఫ్యాన్స్ ను ఉత్సాహ పరచడానికి బాలకృష్ణ తన స్టైల్ లో మైక్ అందుకొని, పాట పాడటానికి స్టేజ్ ఎక్కారు. 'మామా ఏక్ పెగ్ లా' పాట పాడమంటావా? అంటూ అక్కడున్న వారిని నవ్వించారు. చివరకు 'వీర సింహా రెడ్డి' చిత్రంలోని 'సుగుణా సుందరి' అనే సాంగ్ ను ఫీమేల్ సింగర్ తో కలిసి ఆలపించారు.

ఇకపోతే ఇండస్ట్రీలో 50 ఏళ్ళ సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న బాలయ్య.. 60 ఏళ్లకు పైబడిన వయసులోనూ రెట్టింపు ఎనర్జీతో పని చేస్తున్నారు. ఒక సినిమా షూటింగ్ జరుగుతుండగానే ఇంకో చిత్రాన్ని సెట్స్ మీదకు తీసుకొస్తున్నారు. 'అఖండ' 'వీర సింహా రెడ్డి' 'భగవంత్ కేసరి' హ్యాట్రిక్ విజయాలు అందుకున్న బాలకృష్ణ.. మొన్న సంక్రాంతికి 'డాకు మహారాజ్' మూవీతో మరో హిట్ కొట్టారు. ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ 2: తాండవం' సినిమాలో నటిస్తున్నారు. ఇది 'అఖండ' చిత్రానికి సీక్వెల్. దసరా పండక్కి రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. దీని తర్వాత గోపీచంద్ మలినేని డైరెక్షన్ లో మరో మూవీ చేయడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం.

# ఫస్ట్ టైమ్ లైవ్‌లో సినిమా షూటింగ్

సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటిస్తున్న సినిమా 'మజాకా'. రావు రమేష్, అన్షు మరో జోడీగా కనిపించనున్నారు. త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మహా శివరాత్రి స్పెషల్ గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆల్రెడీ ప్రమోషనల్ కంటెంట్ తో సందడి చేస్తున్న ఈ మూవీ ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో, ఓ వినూత్నమైన ఐడియాతో పబ్లిసిటీ చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

'ఊరి పేరు భైరవకోన' సినిమాతో సక్సెస్ ట్రాక్ ఎక్కిన టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్.. 'మజాకా' మూవీతో ఆడియన్స్ ను అలరించడానికి రెడీ అవుతున్నారు. ఇది అతని కెరీర్ లో ల్యాండ్ మార్క్ 30వ సినిమా. 'ధమాకా' ఫేమ్ త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ బాగానే ఆకట్టుకుంది. మరో పది రోజుల్లో సినిమా థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ చిత్రాన్ని మరింతగా జనాల్లోకి తీసుకెళ్లడానికి చిత్ర యూనిట్ ఓ యునిక్ ఐడియాతో వస్తున్నారు.

తొలిసారిగా సినిమా షూటింగ్‌ను ప్రత్యక్ష ప్రసారం చేయడానికి 'మజాకా' టీమ్ ప్లాన్ చేసింది. 'రావులమ్మ' అనే సాంగ్ షూటింగ్ ను లైవ్ లో చూపిస్తామని మేకర్స్ తాజాగా ప్రకటించారు. రేపు సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి షూటింగ్ ప్రత్యక్ష ప్రసారం అవుతుందని తెలిపారు. అలానే చిత్ర బృందంతో చిట్ చాట్ ఉంటుందని సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. హీరో సందీప్ కిషన్ తో సహా మిగతా ప్రధాన నటీనటులు, టెక్నీషియన్స్ ఈ షూట్ లో పాల్గొంటారని తెలుస్తోంది.

ఈ రోజుల్లో సినిమాని జనాల్లోకి తీసుకెళ్లడానికి దూకుడుగా ప్రచారం చేయాల్సి వస్తోంది. టీజర్, ట్రైలర్, సాంగ్స్ ఎంత బాగున్నా.. సినిమాకి మరింత బజ్ తీసుకురావడానికి మేకర్స్ ఏదైనా కొత్త ప్రమోషనల్ స్ట్రాటజీతో పబ్లిసిటీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రెగ్యులర్ ఇంటర్వ్యూలు, ప్రెస్ మీట్స్, ఈవెంట్స్ సరిపోవడం లేదు. అందుకే ఇప్పుడు 'మజాకా' టీమ్ వినూత్న ప్రమోషన్లకు శ్రీకారం చుడుతోంది. సినీ హిస్టరీలోనే ఫస్ట్ టైం సినిమా షూట్ ను లైవ్ లో చూపించబోతున్నారు. మరి ఈ ఐడియా సినిమాకి ఏ మేరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

'మజాకా' చిత్రంలో సందీప్ కిషన్ సరసన రీతూ వర్మ హీరోయిన్ గా నటిస్తోంది. 'మన్మథుడు' ఫేమ్ అన్షు, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్ పై రాజేశ్ దండా, ఉమేష్ కేఆర్ బన్సాల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలాజీ గుట్ట సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దీనికి ప్రసన్నకుమార్ బెజవాడ కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు.

